క్లుప్తంగా

లోక కల్యాణం కోసం హోమాలు



హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన అమ్మా స్ఫటిక లింగేశ్వర ఆలయంలో శనివారం శ్రావణ మాస పౌర్ణమిని పురస్కరించుకొని లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. ముందుగా అమ్మా స్ఫటిక లింగేశ్వరానికి అభిషేకాలు నిర్వహించి మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం చేశారు. అనంతరం భక్తులు, ఒకరినొకరు రాఖీలు కట్టుకొని నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు యోగేంద్ర, వాసు, పుల్లారెడ్డి, గాంధీ, అనిల్, రఘునాథరెడ్డి, యోగా సభ్యులు పాల్గొన్నారు.

దేశభక్తిని అలవర్చుకోవాలి



ఆధ్యాత్మిక సందేశమిస్తున్న జయదేవానంద

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ దైవభక్తితోపాటు దేశభక్తిని అలవర్చుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచారకులు జయదేవానంద సూచించారు. మండలంలోని రేవనూరులో టీటీడీ ఆధ్వర్యంలో ఐదు రోజుల నుంచి కొనసాగుతున్న ధార్మిక కార్యక్రమాలు శనివారం ముగిశాయి. చివరి రోజు పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం సురక్షితంగా ఉంటే ధర్మం సురక్షితంగా ఉంటుందని, భక్తి భావన పెరుగుతుందన్నారు. ప్రజల్లో సమైక్యత భావన నెలకొల్పేందుకు పండుగలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, ఆలయ ధర్మకర్త సంజీవ రెడ్డి, సర్పంచ్ సరస్వతమ్మ, భజన మండలి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

బండి ఆత్మకూరు: హైదరాబాద్‌కు చెందిన రాజారెడ్డిపై శనివారం చీటింగ్ కేసు నమోదు చేశామని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. మండలంలోని కడమల కాలువ గ్రామానికి చెందిన రాజేష్‌కు చెందిన కారును.. హైదరాబాద్‌లోని రాజారెడ్డి నెల బాడుగకు తీసుకున్నాడని, అయితే బాడుగ ఇవ్వకపోవడం, కారును తిరిగి వెనక్కి ఇవ్వకుండా సతాయిస్తున్నాడని రాజేష్ చేసిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు నమోదు చేశామన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



మృతిచెందిన షాజహాన్

ఆళ్లగడ్డ: సరదాగా స్నేహితులతో ఈతకు వెళ్లి ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ విషాద ఘటన ఆళ్లగడ్డ మండల జి.జమ్ములదిన్నెలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. జి.జమ్ములదిన్నె గ్రామానికి చెందిన వడ్ల మీరావలి కుమారుడు షాజహాన్ (17) ప్రకాశం జిల్లా కంభం పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిప్లమా చదువుతున్నాడు. కళాశాలకు వరుసగా మూడు రోజులు సెలవులు ప్రకటించడంతో శుక్రవారం గ్రామానికి వచ్చాడు. శనివారం స్నేహితుడితో కలిసి గ్రామ సమీపంలోని ఏరులో ఈత కొట్టేందుకు వెళ్లారు. గట్టువెంట ఈతకొడుతూ ప్రవాహాన్ని అంచనా వేయలేక షాజహాన్ నీటిలో మునిగి పోయాడు. గమనించిన స్నేహితుడు గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల పొలాల్లో ఉన్నవారు వచ్చి అతడిని వడ్డుకు చేర్చారు. ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. చేతికి వచ్చిన కుమారుడు మృతితో మీరావలి కుటుంబ సభ్యులు విలపించిన తీరు చూపరులను కన్నీరు పెట్టించింది.

ఉప్పొంగిన వాగులు.. నీట మునిగిన పంటలు

- రుద్రవరం, దొర్నిపాడులో భారీ వర్షం
- మినుము, మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం

కుండపోత వర్షంతో రుద్రవరం, దొర్నిపాడు మండలాల్లో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలు చోట్ల రాకపోకలు స్తంభించిపోగా.. పంట పొలాలు నీటిమునిగాయి. నాలుగు రోజుల నుంచి మోస్తరుగా కురిసిన వర్షం శనివారం మధ్యాహ్నం భారీగా కురిసింది. దీంతో తేమశాతం అధికం కావడంతో వివిధ పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది. రుద్రవరం, దొర్నిపాడు మండలాల్లో 10 వేల ఎకరాలకు పైగా సాగైన మినుము పంట కోతకొచ్చింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కాయలన్నీ చిట్లి పోతున్నాయని కర్షకులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికే పంట కోసిన రైతులు దిగుబడులు తడవకుండా కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. –రుద్రవరం/దొర్నిపాడు



దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో నీటమునిగిన మినుము పంట



రుద్రవరం మండలం పేరూరు వద్ద వర్షానికి తడిసిన మినుములను ఆరబెట్టిన దృశ్యం







గాడిదొంక పొంగిపొర్లడంతో కంపమల్ల-క్రిష్టిపాడు మధ్య స్తంభించిన రాకపోకలు, చాకరాజువేముల వద్ద వర్షపు నీటిలో మొక్కజొన్న, ఎర్రగుడిదిన్నె వద్ద దిగుబడులు తడిసిపోకుండా టార్పాలిన్ కప్పేసిన దృశ్యం

టార్గెట్ బాల్ క్రీడల్లో ప్రతిభ



ప్రతిభ చాటిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు

పాణ్యం: అసోసియేషన్ జూనియర్స్ మీట్ నిర్వహించిన టార్గెట్‌బాల్ టోర్నమెంట్‌లో నంద్యాల జిల్లా మూడవస్థానంలో నిలిచింది. ఈ టీమ్‌లో పాణ్యం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులే అధికంగా ఉన్నారు. శనివారం ప్రిన్సిపాల్ దినేష్‌బాబు మాట్లాడుతూ.. ఈనెల 8న తూర్పు గోదావరి జిల్లాలో రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ క్రీడలు జరిగాయన్నారు. ఈ క్రీడల్లో నంద్యాల జిల్లా మూడవ స్థానంలో నిలువగా.. ఇందులో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చూపారన్నారు. ఇందుకు కృషి చేసిన పీడీ కిరణ్‌కుమార్‌రెడ్డిని అభినందించారు.

ఘనంగా రక్షాబంధన్



రాఖీ కడుతున్న ఆయూష్ యోగా సభ్యురాలు

నంద్యాల(వ్యవసాయం): అన్నా చెల్లెల బంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలు నంద్యాలలో ఘనంగా జరిగాయి. సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టి తమ ప్రేమను చాటుకున్నారు. పట్టణంలోని ఆయూష్ యోగా కేంద్రంలో ప్రముఖ యోగా గురువు ఆనంద్ గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాఖీ పౌర్ణమి వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథరెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త భిక్షమయ్య గురూజీలు హాజరయ్యారు. యోగా మహిళలు సోదర సమానులకు రాఖీలు కట్టి నీకు నేను రక్షా... నీవు నాకు రక్షా... మనిద్దరం దేశానికి రక్ష అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్, సుబ్బారెడ్డి, మహేష్‌నాయుడు, ధనుంజయ, ఆంజనేయులు, సులోచన, అపర్ణ, వెంకటేశ్వర్లు, వసుమతి, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళన బాట



ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఎంఎం రూరల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీలో మొబైల్ టీం ఆఫీసర్లు, అటెండర్లుగా పని చేస్తున్న దివ్యాంగులకు 16 నెలల నుంచి జీతాలు అందకపోవడంతో ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని కోరుతూ శనివారం రాయలసీమ వికలాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో వారు ర్యాలీగా టూటౌన్ పోలీసు స్టేషన్‌కు చేరుకొని సీఐ ఇస్మాయిల్‌కు ఫిర్యాదు చేశారు. నేడు, రేపు అంటూ ఎంఎం రూరల్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ తమకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సేవా సమితి అధ్యక్షుడు బాలసుబ్బయ్య, డిజేబుల్ వెల్ఫేర్ రైట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్‌వలి, వికలాంగుల ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు మరియదాసు, సుధాకర్, వికలాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది వెంకటేశ్వర్లు, దానంబాబు, మోహన్ రెడ్డి, నాగరాజు, చంద్రగౌడ్, గోపాల్, రమేష్, రాజు, శివనాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలి

గోస్పాడు: విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. వర్షాకాలంలో ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు త్వరిత గతిన బిల్లులు చెల్లించేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

'నేను మౌన ప్రేక్షకుణ్ణి కాను' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: రాజ్యం కుట్రపూరితంగా వ్యవహరించి ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయడం దుర్మార్గమని ప్రముఖ న్యాయవాది జయరాజు అన్నారు. శనివారం రాత్రి టీజీవీ కళా క్షేత్రంలో విరసం ఆధ్వర్యంలో ఆదివాసీ హక్కుల నేత స్టాన్ స్వామి రచించిన జైలు డైరీ 'నేను మౌన ప్రేక్షకుణ్ణి కాను' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రముఖ విమర్శకులు డాక్టర్ నాగేశ్వరాచారి సభాధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో పౌరులకు న్యాయం అందడం లేదని స్టాన్ స్వామి ఉదంతమే ఉదాహరణ అన్నారు. నేరస్తులు తప్పించుకుని తిరుగుతున్నారని, నేరం చేయనివారు బంధీలవుతున్నారన్నారు. దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని అన్నారు. ఈ పుస్తకం నివాళి కాదని, ఇది ప్రగతిశీల వాదులకు కార్యాచరణగా భావించాలన్నారు. సభలో విరసం నాయకులు పాణి, అరుణ్ ప్రసంగించారు.

11 నుంచి మాధవీలింగేశ్వర ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

వెలుగోడు: మండల పరిధిలోని మాధవరం గ్రామంలో ప్రజల సహకారంతో నూతనంగా నిర్మించిన మాధవీ లింగేశ్వర ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నాయకులు రామచంద్రారెడ్డి, శివశంకర్ రావు, సుధాకర్ రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, మేలు వెంకటయ్య, సంజీవరెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ గణపతి శివపార్వతుల, సుబ్రమణ్యేశ్వర, నవగ్రహ, ధ్వజ, నాభిశిలా, గంగమ్మ, పోతురాజుల విగ్రహాలను కూడా ప్రతిష్ఠించనున్నట్లు చెప్పారు.

ఊరూరా ఆధ్యాత్మిక శోభ



ఆర్.జంబులదిన్నెలో...



సుద్దమల్ల కంబగిరి స్వామి ఆలయంలో..



నంద్యాల.. విష్ణు సహస్ర నామంలో భక్తులు



ప్రత్యేక అలంకారంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి



వాసాపురం వెంకటేశ్వర స్వామి పూజల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల (వ్యవసాయం)/ఉయ్యాలవాడ: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయాన్నే సమీపంలోని ఆలయాలకు చేరుకొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉయ్యాలవాడ మండలంలో సుద్దమల్ల, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన ఆలయా ల్లో భక్తజన సందడి కనిపించింది. శ్రీ లక్ష్మి నరసింహ కంబగిరిస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులువేకువజామున్నే ప్రత్యేక అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, కమలేష్‌శర్మ, అనంతయ్య, భాస్కరశర్మలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కోవెలకుంట్ల పరిధిలోని ఆలయాలకు నూతన గ్రూపు 2 ఈఓగా నియమితులైన బాలచెంచన్న శనివారం శ్రీ లక్ష్మి నరసింహ కంబగిరి స్వామి ఆలయాన్ని సందర్శించి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను పరిశీలించారు. అర్చకులు కమలేష్‌శర్మ, ఆలయా మాజీ ధర్మకర్త సలిపెల నారాయణరెడ్డి శాలువ కప్పి, పూలమాలతో సన్మానించారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

నంద్యాల పట్టణంలోని సంజీవనగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి జన్మనక్షత్రం, శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి సుప్ర భాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సామూహిక విష్ణు సహస్ర నామార్చన నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలుఅందజేశారు. సాయంత్రం లోకకల్యాణంకోసం శ్రీవినాయక, ధన్వంతరి, సుదర్శన హోమాలు చేశారు. కార్యక్రమంలో భగవత్‌సేవా సమాజ్ సభ్యులు సముద్రాల సూర య్య, శ్రీనివాస్, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలి మేరలో వెలసిన లక్ష్మీ, గోదా సమేత వాసాపురం వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

శిరివెళ్ల: డెంగీపై అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రజలకు డెంగీపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ ఓ రామ్మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: మినీ గోకులాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసశర్మ శనివారం తెలిపారు. మినీ గోకులాల కింద నిర్మాణాలకు 5 ఎకరాలు తక్కువగా ఉన్న రైతులు, బర్రెలు ఉన్న రైతులు ఇంటి వద్ద స్థలం ఉన్న వారు అర్హులన్నారు. గోకులాల నిర్మాణాలకు రూ.2 లక్షలు సబ్సిడీ ఉందన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను ఉపాధి పథకం అధికారులకు అందజేయాలన్నారు. అలాగే కోళ్లు, గొర్రెలకు కూడా రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

బంగారు గొలుసు చోరీ

బేతంచెర్ల : వివాహ వేడుకకు హాజరైన ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీకి గురైన సంఘటన పట్టణంలోని జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం చోటు చేసుకుంది. పగిడాల మండలం నెహ్రూనగర్‌కు చెందిన వసంత జీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న వివాహ వేడుకకు హాజరై అక్కడే పెళ్లి వారితో కలిసి నిద్రించారు. శనివారం తెల్లవారు జామున తన మెడలోని మూడు తులాల బంగారు చైనును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. దీనిపై బాధిత మహిళ బేతంచెర్ల పోలీసులకు పిర్యాధు చేసినట్లు తెలిసింది.

బస్సు ఢీకొని విద్యార్థికి గాయాలు

బేతంచెర్ల : పట్టణ సమీపంలోని అయ్యలచెరువు కాట వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో విద్యార్థికి గాయాలయ్యాయి. మాబాషా అనే విద్యార్థి సైకిల్‌పై వస్తుండగా కర్నూలు వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో బాలుడికి గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమ్మిత్తం వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు.

వేధింపుల కేసు నమోదు

బనగానపల్లె రూరల్: భర్త వేధిస్తున్నట్లు ఓ మహిళ నందివర్గం పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణానికి చెందిన షేక్ హుస్సేన్ బాషా తన కూతురు అయేషాను నాలుగేళ్ల క్రితం చెరువుపల్లె గ్రామానికి చెందిన హైదర్ సాహెబ్‌గారి పెద్ద అబ్బాస్‌మియ్యా కుమారుడు బాషాకు ఇచ్చి వివాహం చేశారు. అయితే బాషా మద్యానికి బానిస కావడంతో పాటు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని భార్యను వేధించడం మొదలుపెట్టాడు. విసిగిపోయిన ఆమె ఈ నెల 6వ తేది అక్రమ సంబంధంపై భర్తను ప్రశ్నించింది. ఇందుకు ఆగ్రహించిన బాషా కర్రతో ఆమె తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో బాషాపై వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అహోబిలంలో పౌర్ణమి పూజలు



ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం మూలమూర్తులకు నిత్యపూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆలయం ముఖద్వారం మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. తర్వాత దూపదీపాలతో మహామంగళహారతి ఇచ్చి నైవేద్యం నివేదించారు. రాత్రి విశేషాలంకరణలో స్వామి ఉభయ దేవేరులతో కొలువుదీరి మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. తిరిగి దేవాలయం చేరుకున్న అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు

- ఆగిపోయిన జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల నిర్మాణం
- పనులపై దృష్టిసారించని కూటమి సర్కారు
- బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో గురుకుల పాఠశాల నిర్వహణ
- సరైన వసతులు లేక విద్యార్థుల ఇక్కట్లు

'గురుకుల'కు చంద్ర గ్రహణం!



అసంపూర్తిగా నిలిచిపోయిన గురుకుల పాఠశాల భవన నిర్మాణం

బనగానపల్లె: బడుగు,బలహీన వర్గాల పిల్లలు చదువుకునే గురుకుల పాఠశాలపై చంద్రబాబు సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పెండింగ్ పనులు పూర్తి చేయడం లేదు.దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీ విద్యార్థుల కోసం బనగానపల్లెకు మహాత్మాజ్యోతి రావుపూలే బీసీ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. సొంత భవనం లేకపోవడంతో అప్పటికప్పుడు బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో తాత్కాలికంగా తరగతులు ప్రారంభించింది. ఒకే చోట రెండు నిర్వహణ ఇబ్బందిగా మారింది. దీంతో 2023లో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమస్యను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పక్కా భవన నిర్మాణానికి రూ.2.36 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో వెంటనే బనగానపల్లె పట్టణ సమీపంలోని రవ్వలకొండపై గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు చురుగ్గా సాగుతున్న సమయంలో అంటే 2024లో కూటమి సర్కారు ఏర్పడింది. అప్పటి నుంచి ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నేటికీ అదే పరిస్థితి నెలకొనడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉండి ఉంటే ఈ సమయానికి అన్ని వసతులతో గురుకుల పాఠశాల నిర్మాణ పనులు పూర్తై ప్రారంభం కూడా అయ్యేదని, ప్రభుత్వం మారడంతో గ్రహణం పట్టిందని విద్యార్థుల తల్లిదండులు వాపోతున్నారు.

అరకొర సౌకర్యాల మధ్య విద్యాభ్యాసం

బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో గురుకుల పాఠశాలను నిర్వహిస్తుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.ఈ రెండు విద్యాసంస్థలకు సంబంధించి మొత్తం 350 మంది ఉన్నారు. వీరు ఇరుకు గదుల్లో అరకొర సౌకర్యాల మధ్య చదువు సాగించలేకపోతున్నారు. తాగునీటికి, భోజనానికి, వసతికి సమస్యగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల నిర్మాణ పనులు పూర్తికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.